క్లుప్తంగా

దేగాంలో స్వచ్ఛ భారత్



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం గ్రామంలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సుర శ్రీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, బాస సురేష్, లోక రాంరెడ్డి, హర్ష, హరీష్, మల్లయ్య, రమేష్, ప్రశయ్‌తేజ్, అశోక్, శివ కేశవులు, దశా గౌడ్ పాల్గొన్నారు.

నందిపేట్‌లో..



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, విద్యార్థులకు స్వచ్ఛ భారత్ ప్రాముఖ్యతను వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు పటేల్ రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగ సురేష్, కస్తూరి గంగాధర్, సిరిపురం రవీందర్, ప్రవీణ్, కిషన్, సూది సాయికుమార్, నవీన్, కొందపురం భోజన్న, పంచరెడ్డి ఎర్రన్న, లక్ష్మణ్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పీఆర్సీ బకాయిలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ మున్సిపల్ కార్మికులకు పీఆర్సీ బకాయిలు త్వరలో రానున్నట్లు టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్ తెలిపారు. మున్సిపల్ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కమిషనర్‌ను ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం కలిశారు. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులకు రావాల్సిన పీఆర్సీ వేతన బకాయిలు, ఇతర బెనిఫిట్స్ గురించి వివరించారు. దీంతో కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పెంచిన పీఆర్సీ వేతన బకాయిలు రూ. 50 లక్షలు చెల్లించేందుకు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అంగీకరించినట్లు తెలిపారు. నాయకులు నాగేశ్వర్‌రావ్, జవాన్ రాజు, సాయిలులు ఉన్నారు.

కొనసాగుతున్న మండల స్థాయి క్రీడలు



వేల్పూర్: వేల్పూర్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన మండల స్థాయి క్రీడలు గురువారం రెండో రోజు కొనసాగాయి. జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఆటలు నిర్వహిస్తున్నారు. ఎంఈవో రేణుక, మండల క్రీడల కన్వీనర్, వేల్పూర్ హైస్కూలు హెచ్‌ఎం రాజన్న ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల బాలబాలికలు పోటీల్లో పాల్గొంటున్నారు. నేడు పోటీలు ముగియనున్నాయి.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో నిర్మించుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం తహసీల్ కార్యాలయానికి తరలివచ్చారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకుంటే రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. అధికారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని గురువారం నిరుపేదలు ఆందోళన చేశారు. ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. నలుగురు వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి పేదలకు అన్యాయం చేస్తున్నారని వారు ఆరోపించారు. అధికారులు సర్వే చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యా సంస్థల్లో ఘనంగా బతుకమ్మ



బతుకమ్మను తీసుకువస్తున్న ఉపాధ్యాయులు



సాలూరలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

- రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన విద్యార్థినులు, ఉపాధ్యాయులు
- పాటలు పాడుతూ నృత్యాలతో సందడి

బోధన్: సాలూరలోని ప్రజ్ఞశ్రీ విద్యా సంస్థల్లో గురువారం ముందస్తు బతుకమ్మ, దసరా పండుగలను వైభవంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించే దుస్తులు ధరించి, ప్రత్యేక అలంకరణలతో విద్యార్థినులు పాఠశాలకు వచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మలను పేర్చి, పూజలు నిర్వహించారు. అలాగే పాటలు పాడుతూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడారు. పాఠశాల కరస్పాండెంట్ లతా రాజు పండుగల విశిష్టతలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జమ్మి చెట్టుకు పూజలు చేసి దసరా వేడుకలకు శ్రీకారం చుట్టారు.

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్దగల సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లావణ్య ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, కళాశాల ఆవరణలో పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోగల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్ పార్టీ, బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేస్తు సందడి చేశారు. అలాగే బతుకమ్మ వేడుకను వైభవంగా జరుపుకున్నారు.





దాస్‌నగర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో.. ఆర్మూర్‌లోని గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో..

రాష్ట్ర ప్రభుత్వం హామీలను వెంటనే నెరవేర్చాలి





మోస్రాలో వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ ప్రతినిధులు.. ఎడపల్లిలో ధర్నా..

వర్ని(మోస్రా): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వీ హెచ్‌పీఎస్(వికలాంగుల హక్కుల పోరాట సమితి), ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం మోస్రా తహసీల్దార్ కార్యాలయం ఎదుట దివ్యాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజశేఖర్‌కు అందజేశారు. వికలాంగులకు రూ. 6వేల పింఛన్, వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, గీత కార్మికులకు రూ.4వేల పింఛన్ ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. నాయకులు భూమయ్య, విజయ్, సాయిలు, లావణ్య, చందన, నవత పాల్గొన్నారు.

ఎడపల్లిలో..

బోధన్: ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఉపతహసీల్దార్ అనూషకు వారు వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. భూమయ్య, సావిత్రి, దివ్యాంగులు, చేయుత పెన్షనర్లు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయం ముట్టడి

బాల్కొండ: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం వికలాంగులకు వెంటనే పింఛన్ పెంచాలని డిమాండ్‌ చేస్తూ గురువారం ముప్కాల్ తహసీల్ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీ నాయకులు ముట్టడించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రసాద్, వీహెచ్‌పీ జిల్లా నాయకులు గోపు శ్రీకాంత్, శ్రీరామ్, సాగర్, గద్దల రాజేశ్వర్, మహేశ్ పాల్గొన్నారు.

కూచిపూడి డిప్లొమాలో ఉత్తీర్ణత



ఆర్మూర్: పట్టణంలోని నటరాజ నృత్య నికేతన్ కళాకారులు కూచిపూడిలో డిప్లొమా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించినట్లు నాట్య గురువు డాక్టర్ బాశెట్టి మృణాళిని గురువారం తెలిపారు. ప్రాచీన కళా కేంద్ర చండీగఢ్ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల కోర్సులో మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్నారని వివరించారు. తొమ్మిదేళ్ళ వయసులోపు ఉన్న 15 మంది చిన్నారులు కూచిపూడి పరీక్షల్లో ప్రతిభ కనబరచడంపైట్ల హర్షం వ్యక్తం చేస్తూ మెమోలను కళాకారులకు అందజేశారు. తమ నృత్య నికేతన్ పరిధిలో 50 మంది కళాకారులు ఈ ఐదేళ్ల కోర్సును చదువుతున్నారని పేర్కొన్నారు.

ఉచిత న్యాయ సేవలందిస్తాం



పెర్కిట్(ఆర్మూర్) : కోర్టుల ద్వారా న్యాయం కావాలని కోరుకునే నిరుపేదలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలందిస్తామని జిల్లా సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు అన్నారు. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయ్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో వీడీసీల ఆకృత్యాలు మితిమీరుతున్నాయన్నారు. వీడీసీల నుంచి ఇబ్బందులకు గురైన వారు తమను నేరుగా సంప్రదించాలని కోరారు. న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలి





గోవింద్‌పేట్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ.. ఆర్మూర్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెర్కిట్(ఆర్మూర్): మహిళలు విధిగా పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ పీహెచ్‌సీలో గురువారం 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించి, వైద్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం వైద్యులు మహిళలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మానస, హెచ్‌ఈవో రవి, హెల్త్ సూపర్‌వైజర్ అనసూయ కుమారి, ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో గురువారం 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, జిల్లా ఎమ్యూనైజేషన్ అధికారి అశోక్ మాట్లాడుతూ.. మహిళలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. అనంతరం వైద్యులు మహిళలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. వైద్య సిబ్బంది భుజంగ్‌రావు, సాయి, రత్నకుమారి, అనంద్, సురేష్, కృష్ణ, మల్లేశ్వరి, రజిత పాల్గొన్నారు.

రుద్రూర్: రుద్రూర్ పీహెచ్‌సీలో 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి వెంకట్, డీసీవో విశాల శిబిరాన్ని పర్యవేక్షించారు. మండల వైద్యాధికారిణి ఆయేషా సిద్ధిఖా, హెచ్‌ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్లు రవి, సుమతి, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడల్లో ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఇటీవల నిర్వహించిన గ్రామీణ క్రీడల్లో మండలంలోని చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. క్రీడల్లో విద్యార్థులు నాలుగు షీల్డులను కైవసం చేసుకున్నారు. గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీ సభ్యులు విద్యార్థులను అభినందించారు. ఎంఈవో రాజగంగారాం, ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూర్ శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ విట్టం జీవన్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో ముగ్గురు బాధితులకు మంజూరైన రూ. 45 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ నాగభూషణం, మాజీ సర్పంచ్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ రాంరాజ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శరత్, రహీమొద్దీన్, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు గ్రామీణ క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మండల స్థాయి అంతర పాఠశాల క్రీడలు గురువారం ముగిశాయి. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. సాయన్న మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. డీఈవో అశోక్ కుమార్, క్రీడల కన్వీనర్, ఎంఈవో మేస నరేందర్, ఎంపీడీవో గంగాధర్, పీఆర్టీయూ నాయకులు అశ్ఫాక్ అహ్మద్, పీడీలు గటడి రాజేష్, పింజ సురేందర్, విద్యా సాగర్ రెడ్డి, నాయకులు విజయ్, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

మాక్లూర్: ఆలూర్ మండల కేంద్రంలో జరిగిన మండల స్థాయి క్రీడాపోటీల్లో కల్లెడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్‌లో రెండవ బహుమతి సాధించారు. అలాగే వాలీబాల్, ఖోఖో, షాట్‌పుట్ వివిధ విభాగాల్లో ప్రతిభ చూపారు. దీంతో అధికారులు, ఉపాధ్యాయులు పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

పోషణ్ భీ–పడాయి భీ లక్ష్యాన్ని సాధించాలి



వర్నిలో మాట్లాడుతున్న నరేష్

బోధన్: పోషణ్ అభియాన్‌లో భాగంగా 'పోషణ్ భీ- పడాయి భీ' కార్యక్రమ లక్ష్యాన్ని సాధించాలని బోధన్ సీడీపీవో పద్మ అన్నారు. పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ టీచర్లకు 'పోషణ్ భీ పడాయి భీ' కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడారు. కార్యక్రమం ప్రాముఖ్యత, క్షేత్రస్థాయిలో అమలు, తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కో-ఆర్డినేటర్ పిట్ల స్వప్న, పరిశీలకులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రంలో గురువారం వర్ని, చందూర్, మోస్రా, కోటగిరి మండలాలకు చెందిన అంగన్‌వాడీలకు పోషణ భీ- పడాయి భీ అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమానికి పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషక ఆహారాన్ని పిల్లలకు గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా అందించాలని సూచించారు. బోధన్ సీడీపీవో పద్మ, యూనిసెఫ్ కోఆర్డినేటర్ గోపాలకృష్ణ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మనీ, సుమలత, కొమరమ్మ పాల్గొన్నారు.



బోధన్‌లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు

యూరియా సమస్యపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలు



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్మూర్: రాష్ట్రంలో యూరియా కొరత సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు అఖిల భారత ఐక్యరైతు సంఘం(ఏఐయుకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని 11శాతం తగ్గించడంపై పోరాటం ఉధృతం చేయనున్నారు. ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో గురువారం ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈనెల 16 నుంచి 21 వరకు మండలాల్లో ఆందోళన కార్యక్రమాల అనంతరం ఈ నెల 22న జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నామని వివరించారు. ఆందోళనలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు దేవారం, బాబన్న, కిషన్, రాజన్న, గంగారాం, నడిపన్న, దామోదర్, లింబాద్రి, సాయిలు, గంగాధర్, రమేష్, సర్పంచ్, బాలయ్య ఉన్నారు.

యూరియా కోసం అన్నదాతల అవస్థలు



బాల్కొండలో టోకెన్ల కోసం క్యూ కట్టిన రైతులు

బాల్కొండ : యూరియా కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. స్థానిక సహకార సంఘానికి యూరియా బస్తాలు రావడంతో యూరియా కోసం రైతులు మండల వ్యవసాయ కార్యాలయం వద్ద గురువారం ఉదయం నుంచి క్యూ కట్టారు. రైతులు తమ పట్టాపాస్ పుస్తకాలతో టోకెన్ల కోసం క్యూలో నిలబడ్డారు. ప్రస్తుతం వరి పంట చిరు పొట్ట దశలో ఉండటంతో ఎక్కువగా డిమాండ్ ఉందని రైతులు పేర్కొంటున్నారు. పోలీస్ బందోబస్తు మధ్య యూరియా బస్తాలను సరఫరా చేశారు.

చరిత్రను భావితరాలకు అందించడం కోసమే..

సుభాష్‌నగర్: అతి పురాతన, మహోన్నతమైన చరిత్ర కలిగిన ఇందూరు జిల్లా చరిత్రను పూర్తి ఆధారాలతో భవిష్యత్‌తరాలకు అందించడం కోసమే ఇందూరు జిల్లా చరిత్ర, సంస్కృతి అనే పేరుతో పుస్తకాన్ని రూపొందిస్తున్నట్లు ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వీరేంద్ర తెలిపారు. సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన వ్యాసకర్తలు, జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. చరిత్రను రాయకపోవడం వల్ల భవిష్యత్ తరాలు అగమ్య గోచర స్థితిలోకి వెళ్లిపోతాయన్నారు. అందుకే చరిత్రను తప్పనిసరిగా రాయాలని అన్నారు. చరిత్ర పరిశోధకుడు జై కిషన్ మాట్లాడుతూ.. ఇనుము, ఉక్కు ఖనిజాలకు పెట్టింది పేరుగా ఇందూరు ప్రాంతం నిలుస్తుందన్నారు. ఇతిహాస సంకలన సమితి జిల్లా అధ్యక్షుడు కల్వకోట నరేశ్ కుమార్ మాట్లాడుతూ.. కేవలం చరిత్ర పరిశోధకులు మాత్రమే కాకుండా అధ్యయనం చేసి ఆధారాలతో సహా గ్రామ చరిత్ర దగ్గర నుంచి జిల్లాలోని ఏ విషయాన్ని అయినా సరే రాయాలనుకునే వారికి ఇతిహాస సంకలన సమితి ఈ పుస్తక రచనలో ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కార్యాధ్యక్షుడు మోహన్ దాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు శైలి బెల్లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, జిల్లా కార్యదర్శి మర్రిపల్లి భూపతి, కోశాధికారి బుచ్చ సాయిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం చరిత్ర విభాగం, ఇతిహాస సంకలన తెలంగాణ వారి సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రాచీన భారత దేశ చరిత్రలో ఇనుము, ఉక్కు చారిత్రక అనోవరణం' అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. చరిత్రకారుడు జైకిషన్ పలు అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి ఉన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెంజల్(బోధన్): రెంజల్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెంజల్, వీరన్నగుట్ట, సాటాపూర్, బోర్గాం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ కిషోర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారి మరమ్మతుల్లో భాగంగా నేడు పలు విద్యుత్ పనులు చేయనుండటంతో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట ఆయా గ్రామాల్లో కరెంట్ ఉండదన్నారు.

రేపు నీటి సరఫరా నిలిపివేత

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి నీటిని సరఫరా చేసే ఫిల్టర్ బెడ్ క్లీనింగ్ చేయనున్న నేపథ్యంలో రేపు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రెంజల్‌లో మెగా వైద్య శిబిరం

రెంజల్(బోధన్): రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చువారు ఆధార్‌కార్డు తీసుకొని రావాలన్నారు.

క్రైమ్స్..

మట్కా నిర్వాహకురాలికి 4రోజుల జైలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్‌లో ఇటీవల పోలీసులు తనిఖీలు చేపట్టగా మట్కా నిర్వాహకురాలు సునీత పట్టుబడ్డారు. దీంతో ఆమెను అరెస్టు చేసి గురువారం ఆర్మూర్ కోర్టులో హాజరు పర్చారు. కాగ జడ్జి ఆమెకు నాలుగు రోజుల సాధారణ జైలు శిక్షణ విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి..

బాల్కొండ: మెండోరా మండల పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించగా మాడబోయిన సాయెందర్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో ఎస్సై సుహాసిని అతడిని అరెస్టు చేసి, గురువారం ఆర్మూర్ కోర్టులో హాజరు పర్చారు. జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్తం

ఘనంగా హిందీ దివస్

దొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీ స్కూల్‌లో గురువారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల చార్ట్‌లను ప్రదర్శించారు. విజేతలకు హెచ్‌ఎం సురేశ్ కుమార్ బహుమతులు అందజేశారు.

బడికి మైక్‌సెట్ అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మైక్‌సెట్‌ను అందజేశారు. రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల రాధా కిషన్, ఖాందేష్ సత్యం, కోశాధికారి కోట నరేష్, రాస ఆనంద్, తులసీ పట్వారి పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గురువారం గ్రామానికి చెందిన సుంక భూషణ్ టై, బెల్టులు, బ్యాడ్జీలను అందజేశారు. హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఓడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వెల్మా సునీత ఇటీవల జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్నారని హెచ్‌ఎం లక్ష్మణ్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఉపాధ్యాయురాలిని పీఆర్‌టీయూ ప్రతినిధులు సన్మానించారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలోని యంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముల్క నర్సయ్యను గ్రామస్తులు గురువారం సన్మానించారు. నర్సయ్య పాఠశాలలో ఉత్తమ సేవలందిస్తూ, గ్రామాభివృద్ధికి కృషి చేయడంపై గ్రామస్తులు ఆయనను కొనియాడారు. వీడీసీ ప్రతినిధులు విజయ్, ధర్మాజీ, సాయిలు, లాలు యాదవ్ పాల్గొన్నారు.

పుస్తక నిర్వహణపై అవగాహన

రుద్రూర్: ఇందిరా క్రాంతి పథంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ సమాఖ్య సహాయకులకు (వీవోఏ)లకు గురువారం పుస్తక నిర్వహణపై సీబీవో ఆడిటర్ మాధవరావ్, డీపీఎం (ఫైనాన్స్) అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు పుల్ సింగ్, చిన్న గంగారాం, విఠల్, ఎంఎస్ అకౌంటెంట్ సుధా తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: కోటార్మూర్‌లో శ్రీ లక్ష్మీ నర్సింహ ఇన్‌ఫ్రా వారు నిర్మాణం చేపడుతున్న అపార్ట్‌మెంట్ పనులు మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని బీఆర్‌ఎస్ నాయకులు నర్మె నవీన్, పూజ నరేందర్ అన్నారు. వెంటనే సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలని వారు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల అందజేత

బోధన్: ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంప్ జెడ్పీ పాఠశాలలో గురువారం ట్రాన్స్‌కో నిజామాబాద్ ఏడీఈ తోట రాజశేఖర్ తన తండ్రి తోట లింగం జ్ఞాపకార్థం విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందించారు. హెచ్‌ఎం రజిని కుమారి, ఉపాధ్యాయులున్నారు.

బీఆర్‌ఎస్ జెండావిష్కరణ

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఆభాదిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ జెండాను బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ అవిష్కరించారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి సూదం నవీన్, నాయకులు హరీఫ్, మోరే కిషన్, ఎంఏ హకీమ్, శ్రీనివాసరావు, రవికుమార్, హన్మంతు, సురేష్ పటేల్, సాయిలు, ఆంజనేయులు పాల్గొన్నారు.